అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇక్కట్లు



గతంలో దుమ్ము, ధూళి, పైకి లేచిన రాళ్లతో అధ్వానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు (ఫైల్)



అప్రోచ్ రోడ్డు ముగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు తదితరులు

ఏళ్లనాటి సమస్యకు అబ్బయ్యచౌదరి ఫుల్‌స్టాప్
హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, ప్రయాణికులు

పెదవేగి: ఏళ్ల నాటి అప్రోచ్ రోడ్డు సమస్యతో ప్రయాణికులు, దుమ్ముధూళితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సర్వాంగ సుందరంగా రోడ్డు నిర్మించడంతో వాహనదారులతోపాటు, స్థానిక ప్రజల ఇక్కట్లు తొలగిపోయాయి. వివరాల్లోకి వెళితే డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో 2006లో పోలవరం పనులు ప్రారంభించారు. దానికి అనుబంధంగా పోలవరం కుడికాలువ పనులు వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఏలూరు–చింతలపూడి ప్రధాన రహదారిలో పెదవేగి మండలం జానంపేట వద్ద అండర్ టెన్నెల్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం రహదారిని తవ్వేశారు. 2014లో బ్రిడ్జి నిర్మాణం, అండర్‌టెన్నెల్ పెదవేగి:పనులు పూర్తి చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి తవ్విన ప్రాంతంలో సుమారు 500 మీటర్ల అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయకపోవడంతో ఐదేళ్లగా వేలాది వాహనాలు మరమ్మతులకు గురవడంతో పాటు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి, పలు ప్రమాదాలకు గురయ్యారు. టీడీపీ పాలనలో ఈ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రజలు దుమ్ము, ధూళితో ఇబ్బంది పడ్డారు. ప్రమాదాలకు గురైనా పట్టించుకున్న నాథుడు లేక గత పాలకులు తీవ్ర విమర్శలకు గురయ్యారు. 2019లో వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అండర్‌టెన్నెల్ బ్రిడ్జి నిర్మించిన కాంట్రాక్టర్లను పిలిచి, అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో జాప్యంపై ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కాంట్రాక్టర్ గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని ఈ పని చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రజల అవస్థలు చూసి, సమస్య తీవ్రతను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే కొఠారు. రూ 1.50 కోట్లు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యేలా కృషి చేశారు. అప్పటి మంత్రి పేర్ని నాని, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. 14 ఏళ్ల నాటి సమస్య పరిష్కారానికి స్పందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక నాయకులు జానంపేట బాబు ఆధ్వర్యంలో అక్విడెక్ట్ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రజలు, వాహనచోదకులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు (ఫైల్)

రూ.1.50 కోట్లతో అభివృద్ధి



గత పాలకుల అప్రోచ్‌రోడ్డు విషయం గాలికొదిలేసారు. వారి నిర్లక్ష్య వైఖరితో ప్రజలు చాలా అవస్థలు పడ్డారు. ఏలూరు–చింతలపూడి ప్రధాన రహదారి మీదుగా వెళ్లే నాయకులు సైతం అప్రోచ్ విషయంలో పలు మార్లు నా దృష్టికి తీసుకుని వచ్చిన వెంటనే ఈ సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లాను. ఆయన వెంటనే ఆయన స్పందించి రూ. 1.50 కోట్లు మంజూరు చేశారు. ప్రజల సమస్యను పరిష్కరించడం సంతోషాన్నిచ్చింది.

– కొఠారు అబ్బయ్యచౌదరి,
దెందులూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



ఘంటా ప్రసాదరావు

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం తథ్యమని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. సోమవారం దెందులూరులోని విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి నివాసంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతోపాటు పేదలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి, భద్రత, భవిష్యత్తును కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. మహిళలకు, దళిత బీసీ, గిరిజనులకు పదవులు కేటాయించి ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు, నవరత్నాల పథకాలతో పాటు సంక్షేమం, అభివృద్ధి లబ్ధిని నేరుగా లబ్ధిదారుల గడప వద్దకే వలంటీర్ల ద్వారా అందజేసిన ముందు చూపున్న నాయకుడు వైఎస్ జగన్ అని ప్రసాద్ అభివర్ణించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ నేడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీ వివక్షత లేకుండా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలతోపాటు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని పెద్ద ఎత్తున మద్దతునిచ్చి ఆశీర్వదించారన్నారు. మరో రెండు వారాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటు తథ్యమన్నారు.

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలతో నిఘా



స్ట్రాంగ్ రూం వద్ద విజిటర్స్ లిస్టును తనిఖీ చేస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు : దెందులూరు నియోజకవర్గ స్ట్రాంగ్‌రూమ్ వద్ద సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు వచ్చిన వారు ఎవరైనా సరే విజిటర్స్ రిజిష్టర్‌లో విధిగా సంతకం చేయించాలని భద్రతా అధికారులకు రిటర్నింగ్ ఆఫీసర్ హోదాలో ఆదేశాలు ఇచ్చిన సంగతి విదితమే. ఇప్పటికే మూడంచెల భద్రతతో పాటు సీసీ కెమెరాలు, విజిటర్స్ రిజిష్టర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్‌ను ఆమె పరిశీలించారు.

సీనియర్ సిటిజన్లకు వడ్డీ 8.6 శాతం చెల్లింపు



నూతన భవనంలో కార్యాలయం ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

నిడమర్రు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ద్వారా 2024 మార్చి నాటికి 10,028 కోట్లు ఖాతాదారులు నుంచి డిపాజిట్ల రూపంలో సేకరించినట్లు ఆ బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సీజీజీ బ్యాంక్ నిడమర్రు శాఖను నూతన భవనంలోకి కార్యాలయాన్ని మార్పు చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 8 జిల్లాల్లో 268 శాఖల్లో రూ.12,500 కోట్లు రుణాలు అందించామన్నారు. సీనియర్ సిటిజన్లకు వడ్డీ 8.6 శాతం చెల్లిస్తున్నామన్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో మారో రెండు శాఖలను ప్రారంభిస్తామన్నారు. రీజనల్ మేనేజర్ యు. శ్రీదేవి మాట్లాడుతూ తన పరిధిలో రూ.1,495 కోట్లు డిపాజిట్లు సేకరించామన్నారు. నిడమర్రు బ్రాంచ్‌లో లాకర్ సౌకర్యం ఉంటుందన్నారు. బ్యాంక్ మేనేజర్ ఆర్ శ్రీనివాసబాబు, ప్రధాన కార్యాలయం ప్రణాళిక అధికారి అంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీలకు పే స్లిప్ ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీ రామకృష్ణ

దెందులూరు: ఉపాధి కూలీలకు పే స్లిప్పులు అందజేసి మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ, టెంట్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ కోరారు. సోమవారం దెందులూరు మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అధికారులు అన్ని ప్రదేశాల్లో కూలీల పనుల నాణ్యత మాత్రమే చూస్తున్నారని, వారికి లభించే వేతన బకాయిలు విడుదల చేయలేకపోతున్నారన్నారు. ఉపాధిహామీ పనులు, పంట కాలువల్లో, చెరువుల్లో పూడికతీత పనులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని నిర్ణయించడం ఉపాధికూలీలకు గండి కొట్టడమేనన్నారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు హెచ్‌ఎం ఎస్ వెంకటలక్ష్మి పరివేక్షణలో ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేస్తున్నారు.

నృత్య సంగీత ధ్యాన యజ్ఞం

జంగారెడ్డిగూడెం: స్థానిక శేషాద్రినగర్‌లోని మైత్రేయ మందిర ప్రాంగణంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా 22న సాయంత్రం నృత్య సంగీత ధ్యాన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ తెలిపింది. చిన్నారులచే నృత్య ప్రదర్శన, సంగీత శిక్షకురాలు మల్లాది పర్వత వర్ధని శిష్యబృందంచే శ్రీరామ గానామృతం, శాస్త్రీయ సంగీత కచేరీ, ధ్యానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరి సేవలు చిరస్మరణీయం



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్, విద్యార్థులు

భీమడోలు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. మండలలలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. అనంతరం టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.రిటైర్డ్ హెచ్‌ఎం బి.పరశురాముడు, గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, పూడిక తొలగించాలి



గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, మట్టిని చూపిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రైతులు

దెందులూరు : గోదావరి కాల్వలో గుర్రపు డెక్క, మట్టి పూడికతీతను తీసి కాల్వను బాగు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరు మండలంలోని ఉండ్రాజవరం, కొవ్వలి గ్రామాల వద్ద గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, మట్టి పూడికలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కే. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యే దశలో కాల్వలు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో శివారు ప్రాంత భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడతారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట్రావు, కొల్లి విజయభాస్కరరెడ్డి, రైతులు ఉన్నారు.

వేంకటేశ్వరుని ఆలయంలో నవకుంభారాధన



గుండుగొలనులో గ్రామ బలిహారం పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దేవదాయ ధర్మశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఆలయంలో విశేష పూజలు చేసారు. అలయ పూజారులు మంగపతి ఆచార్యులు, మోహనకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజలు నిర్వహించారు. మేళాతాళాల నడుమ నవకుంభారాధన, గ్రామ బలిహారం కార్యక్రమాలు చేసారు. స్వామి వారిని మాడ వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈనెల 21న మంగళవారం రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ వగ్వాల మీనాకుమారి, పెద్దలు వగ్వాల అచ్యుతరామారావు, నీలంశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

24న సాల్వేషన్ ఆర్మీ కల్నల్ దెందులూరు రాక

దెందులూరు: దెందులూరులో 125 ఏళ్ల రక్షణ సైన్య సేవా చరిత్ర కలిగిన దెందులూరు ప్రార్థనా మందిరం పునర్నిర్మాణ కార్యక్రమం ఈ నెల 24న ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు నిర్వహించనున్నట్టు కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్య తెలిపారు. సోమ వారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, కల్నల్ సుమిత్రా మసీ, డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే, మేజర్ జల్లి మేరీ, ఐసీఎం అగ్రపీఠాధిపతులు డాక్టర్ ఎస్‌డీ రాజు, ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు.ప్రార్థనా మందిరం పునర్నిర్మాణ శంకుస్థాపనకు రక్షణ సైన్య అన్ని మండల నాయకులు, సంఘ కాపరులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహ సమితి స్త్రీలు, యవ్వనస్తులు హాజరవుతారని మేజర్ రమణయ్య తెలిపారు.

పాఠ్య పుస్తకాల రాక

ఉంగుటూరు: మండలంలోని 1 నుంచి 10వ తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం సెమిస్టర్ –1 కామన్ పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 1 నుంచి 10వ తరగతులకు సంబంధించి సెమిస్టర్–1 కామన్ పుస్తకాలు 46,888 రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 31,323 వచ్చినట్లు చెప్పారు. మిగిలిన 15,565 పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. సెమిస్టర్–2కి సంబంధించిన పుస్తకాలు 15,640 సెప్టెంబర్ నెలలో వస్తాయని తెలిపారు. మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను నారాయణపురం హైస్కూల్లో భద్రపరిచినట్లు ఎంఈవో తెలిపారు.

సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

పెదపాడు: రైతులకు ప్రభుత్వం పచ్చి రొట్ట ఎరువులను 50శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైతు భరోసా కేంద్రంలో జనుము, జీలుగ పిల్లి పెసర విత్తనాలు 50శాతం సబ్సిడీపై రైతులు అందించారు. ఈకార్యక్రమంలో ఏలూరు డివిజన్ ఏడీఏ వై సుబ్బారావు, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కర్రసాముతో ఆరోగ్యం, ఆత్మరక్షణ



శిబిరంలో పాల్గొన్న వివిధ సంస్థ ప్రతినిధులు, శిక్షకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కర్రసాము శారీరక ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం హేలాపురి బాలోత్సవం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో ఆయా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు కర్రసాము చేసి కర్రసాములో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యుడు పి.ఆంజనేయులు మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి సమన్వయకర్తగా కె.శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. మాస్టర్స్ జోగా చంద్రశేఖర్, జోగా మోహన్‌రావు కర్రసాములో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడు మేతర అజయ్ మాట్లాడుతూ శరీర దారుఢ్యం, మానసిక ధైర్యం పెంపొందించుకోవడానికి కర్రసాము ఉపయోగపడుతుందని చెప్పారు. మే 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు కొనసాగే ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్సై ఎం మిల్టన్, ఎన్‌వీ గంగాభవాని, పి.దుర్గాప్రసాద్, సీహెచ్ జగదీష్, పి.అనురాధ, మేతర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

పెదవేగి : పార్టీ కోసం కష్టపడిన ప్రతి వ్యక్తికి అండగా నిలిచి, ఆదుకుంటామని ముండూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ పార్టీ శ్రేణులకు అభయమిస్తున్నారు. పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలెం గ్రామ బూత్ కన్వీనర్ యర్రా శేఖర్ మోటార్‌సైకిల్‌పై నుంచి పడిపోయి గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బలుసు శేఖర్, పోలేపల్లి రత్తయ్యచౌదరి సోమవారం శేఖర్‌ను పరామర్శించారు.

ప్రజా సమస్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. లక్కవరం హైస్కూల్‌లో హిందీ టీచర్ పోస్టును భర్తీ చేయాలని ఎంపీటీసీ దల్లి మోహన్ రెడ్డి, దేవులపల్లిలో వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించి, పనిచేసేలా చేయాలని ఎంపీటీసీ ప్రగడ వెంకటలక్ష్మి కోరారు. కోఆప్షన్ సభ్యుడు లాల్ అహ్మద్ మాట్లాడుతూ తిరుమలాపురానికి ఆర్టీసీ బస్సు నడిపే లా చర్యలు తీసుకోవాలన్నారు. లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కేతవరంలో లైన్‌మెన్‌ను నియమించాలని వైస్ ఎంపీపీ నరెడ్ల బుచ్చి బాబు కోరారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని పనిచేస్తూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చిన నిధులు సకాలంలో వినియోగించకపోతే ఆ నిధులు వెనక్కెళ్లే అవకాశం ఉందని, నిధులు వినియోగానికి ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కె.విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం వృద్ధి

- రైతులకు సబ్సిడీపై విత్తనాలు
- ఆర్‌బీకేల ద్వారా పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పెదపాడు: పచ్చిరొట్ట సాగుతో పొలానికి సారం పెరుగుతుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఏటా ప్రభుత్వం పచ్చిరొట్ట సాగుకు విత్తనాలను 50శాతం సబ్సిడీపై అందజేయడంతో రైతులు తమ పంట పొలాలను సారవంతం చేసుకునేందుకు ఈ విత్తనాలను తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్ తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకువచ్చి రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని ఆయన సూచించారు. విత్తనాలు కావాల్సిన ప్రతి రైతుకు అందిస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట విత్తనాల చల్లడం వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. పచ్చిరొట్ట సాగువల్ల నేలగుల్లగా మారుతుంది. నీరు భూమిలోకి ఇంకే గుణం పెరుగుతుంది. నేలలో సూక్ష్మజీవుల చర్య పెరిగి నేల సారవంతం పెరుగుతుంది. చాలా రకాల పోషకాలు నేలలో వృద్ధి చెంది పంటకు ఉపయోగపడతాయి. రైజోబియా బ్యాక్టీరియా పెరగడం వల్ల ఎకరానికి 20 నుంచి 50 కేజీల నత్రజని అందుతుంది. దీని వల్ల రసాయన ఎరువులు తగ్గించుకోవచ్చు కలుపు మొక్కలు పెరగకుండా ఇవి కాపాడతాయి ప్రతి రైతు పచ్చిరొట్ట పంటలు వేసి నేల సారాన్ని వృద్ధి చేసుకోవాలి. ప్రభుత్వం పచ్చి రొట్ట ఎరువులను జనుము, జీలుగ కేజీ రూ. 88 ఉండగా రైతులకు 50శాతం సబ్సిడీపై రూ.44కు, పిల్లి పెసర కేజీ రూ.134 ఉండగా రూ.67కు అందిస్తున్నారు. విత్తనాలు రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రదీప్ సూచించారు.

అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాల వివరాలు

మండలం	జీలుగ	జనుము	పిల్లిపెసర
పెదపాడు	198 క్వింటాళ్లు	29 క్వింటాళు	86 క్వింటాళ్లు
ఏలూరు	17 క్వింటాళ్లు	–	10 క్వింటాళ్లు
పెదవేగి	332 క్వింటాళ్లు	133 క్వింటాళ్లు	366 క్వింటాళ్లు
దెందులూరు	200 క్వింటాళ్లు	20 క్వింటాళ్లు	50 క్వింటాళ్లు


ఏటా పచ్చి రొట్ట సాగు



ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నారు. ఎకరాకు 10 కిలోల చొప్పున విత్తనాలు అందిస్తున్నారు. ఈ విత్తనాలు చల్లుకోవడం వల్ల భూ సారం వృద్ధి చెందుతోంది. దీంతో ఏటా పచ్చిరొట్టు సాగు చేస్తున్నాం.

– రెడ్డి సతీష్, రైతు, పెదపాడు

ఎరువుల వాడకం తగ్గుతోంది



పచ్చిరొట్ట విత్తనాలు చల్లడంవల్ల భూమి సారవంతం కావడంతో రసాయన ఎరువులు వాడకం తగ్గుతోంది. దీంతో సాగుకు వ్యయం కొంతమేరతగ్గే అవకాశంఉంది. దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– పెద్దింటి రంగరావు, రైతు,పెదపాడు